చెంతనే నీరు.. అందని తీరు

- ఆక్రమణ చెరలో భూమి కాలువ
- శిథిలావస్థకు చేరిన స్లూయిస్‌లు
- షట్టర్లు లేక వృథాగా పోతున్న తాండవ జలాలు

నక్కపల్లి/పాయకరావుపేట: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టు తయారైంది అన్నదాతల పరిస్థితి. తాండవ నదిలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ దానికి అనుసంధానంగా ఉన్న చానళ్ల పరిస్థితి అధ్వానంగా తయారు కావడంతో సాగునీటికి ఎదురుచూపులు తప్పడం లేదు. పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో సుమారు 10 వేల ఎకరాలకు సాగు నీరందించే భూమి కాలువతో పాటు ముతా గ్రోయిన్, ఆవ గ్రోయిన్‌లు ఆక్రమణలకు గురికావడం, మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఖరీఫ్‌లో సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తాండవ రిజర్వాయర్ నుంచి పుష్కలంగా నీరు విడుదల చేస్తున్నప్పటికీ పూడిక తీత చేపట్టకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. మదుములు శిథిలం కావడం, షట్టర్లు లేకపోవడంతో ఖరీఫ్ సీజన్ మొత్తానికి సరిపడాల్సిన నీరు కొద్ది రోజులు మాత్రమే అందుబాటులో ఉంటోంది. దీంతో కాలువల్లో మదుముల వద్ద నీటిని నిల్వ చేసేందుకు వీల్లేని పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు షట్టర్లు లేక నీరు వృథాగా దిగువ ప్రాంతాలకు పోతోంది. వాస్తవంగా ఇదేనీరు రబీకి కూడా సరిపోతుంది. కానీ మరమ్మతులు చేపట్టకపోవడంతో ఖరీఫ్ సీజన్‌కే పరిమితం కావాల్సి వస్తోంది.

తూతూమంత్రంగా పూడిక తీతలు

భూమి కాలువ, దానికి అనుబంధంగా ఉన్న ముతా గ్రోయిన్, ఆవ గ్రోయిన్‌ల కింద పాయకరావుపేట మండలంలో పి.ఎల్.పురం, సీతారాంపురం, నామవరం, గుంటపల్లి మంగవరం, సత్యవరం, గోపాలపట్నం, పెంటకోట, అరట్లకోట, మాసయ్యపేట గ్రామాలు, నక్కపల్లి మండలంలో దేవవరం, ఒడ్డిమెట్ట, చినరామభద్రపురం, గొడిచర్ల, ఉద్దండపురం గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 10 వేల ఎకరాలు సాగవుతోంది. 13 కిలో మీటర్ల పొడవు కలిగిన ఈ కాలువ పూర్తి స్థాయిలో పూడిక తీతకు నోచుకోలేదు. పాయకరావుపేట తాండవ చక్కెర పరిశ్రమ నుంచి పోలీస్ స్టేషన్ వరకు కాలువ గట్లను ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టారు. పెద్ద పెద్ద భవంతులు, ప్రహరీలు నిర్మించడంతో 20 నుంచి 30 అడుగులు నిడివి ఉండాల్సిన కాలువ సగానికి పైగా తగ్గిపోయిందని రైతులు ఆరోపిస్తున్నారు. నామవరం వరకు కాలువ గట్లు ఇరువైపులా ఆక్రమణలకు గురయ్యాయి. గట్టును, కాలువ గర్భాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో పూడిక తీత పనులు తూతూమంత్రంగానే చేపట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భూమి కాలువే కాకుండా ముతా గ్రోయిన్, ఆవ గ్రోయిన్లదీ ఇదే పరిస్థితి. ఈ రెండు చానళ్లు కూడా చాలా రోజుల నుంచి పూడిక తీతకు నోచుకోలేదు. భూమి కాలువ గర్భం రోజురోజుకు తగ్గిపోతోంది. కాలువల మరమ్మతులకు ఈ ఆక్రమణలు అడ్డంకిగా మారాయి.



పాయకరావుపేట వద్ద కాలువ గట్టును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు



ఒడ్డిమెట్ట వద్ద భూమి కాలువకు షట్టర్లు లేక వృథాగా ప్రవహిస్తున్న నీరు

కాలువ	సాగు విస్తీర్ణం	పంటలు	స్లూయిస్‌లు
భూమి కాలువ	4 వేల ఎకరాలు	వరి, చెరకు, అరటి	5
ఆవ గ్రోయిన్	3 వేల ఎకరాలు	వరి, చెరకు, తమలపాకు	4
ముతా గ్రోయిన్	2 వేల ఎకరాలు	వరి, అరటి, తమలపాకు, చెరకు	4

మరమ్మతులకు నోచుకోని స్లూయిస్‌లు

పాయకరావుపేట నుంచి మంగవరం, సత్యవరం, పెంటకోట, గోపాలపట్నం, నామవరం, సీతారామపురం, ఒడ్డిమెట్ట, గొడిచర్ల, ఉద్దండపురం వరకు భూమి కాలువ ద్వారా తాండవ జలాలు వెళ్తుంటాయి. భూమి కాలువకు అనుసంధానంగా ముతా గ్రోయిన్, ఆవ గ్రోయిన్, పెంటకోట గ్రోయిన్‌లు ఉన్నాయి. వీటికి అక్కడక్కడా స్లూయిస్‌లు(మదుం) నిర్మించారు. ఇవి శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు, వాటికి ఏర్పాటు చేసిన షట్టర్లు పాడయ్యాయి. తలుపులు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. షట్టర్లు ఉంటే రైతులకు కావాల్సిన సమయంలో వాటాల ప్రకారం నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి చాలా పర్యాయాలు తీసుకెళ్లామని, ఎటువంటి చర్యలు తీసుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. కాలువలో పిచ్చి మొక్కలు తొలగించి పూడిక తీత చేపట్టడంతో పాటు, స్లూయిస్‌లకు షట్టర్లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

ఆక్రమణలు తొలగించి, పూడిత తీత చేపట్టాలి

తాండవ జలాలు పుష్కలంగా విడుదలవుతున్నాయి. ఏళ్ల తరబడి కాలువలు పూడిక తీతకు నోచుకోకపోవడం, ఆక్రమణలకు గురవడం వల్ల చివరి ఆయకట్టుకు నీరు సరిగా అందడం లేదు. స్లూయిస్‌లకు షట్టర్లు ఏర్పాటు చేస్తే నీరు వృథా కాదు. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి, మరమ్మతులు చేపట్టాలి.

– తోట సత్యకిరణ్, రైతు, గుంటపల్లి

క్లుప్తంగా

పర్యాటక కేంద్రంగా తంతడి బీచ్



తంతడి బీచ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం తంతడి బీచ్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ హామీ ఇచ్చారు. ఆదివారం తంతడి బీచ్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తంతడి బీచ్‌లో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం తంతడి బీచ్ అభివృద్ధికి సంబంధించి అధికారులతో సమావేశమై చర్చించారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత



హరిపాలెంలో అమ్మవారిని దర్శించుకుంటున్న బొడ్డేడ ప్రసాద్

అచ్యుతాపురం(మునగపాక): దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని వైఎస్సార్ సీపీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయన అచ్యుతాపురం మండలం హరిపాలెం హిమగిరి కొండపై కొలువుదీరిన విజయదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ చైర్‌పర్సన్ మారిశెట్టి లక్ష్మీకాంతం దంపతులు ప్రసాద్‌కు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆహ్లాదకర వాతావరణంలో అమ్మవారి ఆలయ నిర్మాణం చేపట్టడం సంతోషకరమన్నారు. ఆలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత పిన్నమరాజు రవీంద్రరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు



మరిడిమాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న నాయకులు

మునగపాక: మండలంలోని తోటాడ పంచాయతీ పరిధిలోని పురాతన మరిడిమాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని ఆదివారం పెద్దలు సందర్శించారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అవసరమయ్యే చర్యల్లో భాగంగా స్థల పరిశీలన చేశారు. ప్రస్తుతం ఉన్న ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో తోటాడ, గవర్ల అనకాపల్లికి చెందిన పలు పార్టీల నేతలు సమాలోచనలు చేశారు. పంచాయతీ పెద్దలతో సమావేశం నిర్వహించి ఆలయ నిర్మాణానికి అవసరమయ్యే చర్యలు తీసుకుంటామని సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దలు భాస్కరరావు, మురళి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భారీ అన్నసమారాధనలు



భక్తులకు అన్న వడ్డన చేస్తున్న కమిటీ సభ్యులు

మునగపాక: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల వ్యాప్తంగా ఆదివారం పలు చోట్ల భారీ అన్న సమారాధనలు జరిగాయి. మునగపాక లింగరాయి గుడి వద్ద ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రసాదం స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కాండ్రేగుల రామగణేష్, కోశాధికారి బొడ్డేడ రమణ, కమిటీ సభ్యులు తదితరులు అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

నీటి సరఫరాకు అంతరాయం నేడు



పైప్‌లైన్‌కు మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

యలమంచిలి రూరల్: పట్టణ ప్రజలకు నీటి కష్టాలు కొనసాగుతున్నాయి. ఇటీవల తరచూ నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుండగా.. సోమవారం మరోసారి నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు ఆదివారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణానికి ప్రధానంగా నీటి సరఫరా అందించే ఎర్రవరం సంప్ వద్ద పైపులైన్ దెబ్బతినడంతో పట్టణంలోని 4 నుంచి 11 వార్డులు, 24, 25 వార్డులకు నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. పాతవీధి, తులసీనగర్, జలాల్ వీధి, ఒరుగంటివారి వీధి, ఏఎస్ఆర్ కాలనీ, కాకివాని వీధి, ధర్మవరం, భావన రిషి, కోర్టు ప్రాంతాలకు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఈ కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయనున్నట్టు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. దెబ్బతిన్న పైప్‌లైన్‌కు మరమ్మతు పనులు చేయిస్తున్నామన్నారు. ఆ పనులు పూర్తయితే నీటి సరఫరా యథావిధిగా జరుగుతుందన్నారు.

నేటి నుంచి డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

యలమంచిలి రూరల్: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో 2024–25 సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల ప్రక్రియలో భాగంగా స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాలు జారీ చేసిందని యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం నుంచి బుధవారం వరకు ఆయా కళాశాలలకు వెళ్లి రిజిస్ట్రేషన్ ఫీజు రూ.400 చెల్లించి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంకా డిగ్రీ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు రూ.100 ఆలస్య రుసుంతో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు.

ఆకట్టుకున్న క్రీ నీడ, విముక్తి నాటికలు



క్రీ నీడ నాటికలో ఓ సన్నివేశం



జనరాజ్‌దాస్ చిత్రపటం వద్ద నివాళులర్పించి నాటిక ప్రదర్శనలను ప్రారంభిస్తున్న నాయకులు

మునగపాక: మునగపాక నందీశ్వర ప్రాంగణం తులసీ కళా వేదికపై ఆదివారం రాత్రి ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్, దివంగత నేత పెంటకోట జనరాజ్‌దాస్ జయంతి కార్యక్రమంలో భాగంగా ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కాకినాడకు చెందిన శ్రీసాయి కార్తీక క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన 'క్రీ నీడ' నాటిక ఆలోచింపజేసింది. ఈ నాటికను బీవీ అప్పారావు రచించగా.. సీహెచ్ మహేష్ దర్శకత్వం వహించారు. ద్వితీయ ప్రదర్శనగా గుంటూరు ఉషోదయ కళా నికేతన్ కళాకారులు 'విముక్తి' నాటికతో ఆకట్టుకున్నారు. ఈ నాటికకు రచన, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు వ్యవహరించారు. గ్రామీణ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాటిక ప్రదర్శనలను తిలకించేందుకు కళాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నాటిక ప్రదర్శనలను వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సంస్థ అధ్యక్షుడు సూరిశెట్టి రాము, తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మునగపాక గ్రామాభివృద్ధికి జనరాజ్‌దాస్ అందించిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, రంగ స్థల నటులు మళ్ల సంజీవరావు, టిక్కలి కొండలరావు, దాడి ముసిలినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పెద్దలు పెంటకోట విజయ్, టెక్కలి పరశురామ్, కోనపల్లి రామ్మోహనరావు, పెంటకోట వెంకట్, బోడకుర్తి గణేష్, మొల్లేటి సత్యనారాయణ, పెంటకోట వెంకటరావు, ఆడారి కాశీబాబు, కేపీ రావు, జనరాజ్ దాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న కమిటీ ప్రతినిధి సత్యనారాయణ

మునగపాక: అయ్యప్ప ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆలయ కమిటీ ప్రతినిధి మొల్లేటి సత్యనారాయణ కోరారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో దసరా తరువాత నుంచి కార్తీక మాసం వరకు ఉచితంగా భిక్ష సదుపాయం కల్పిస్తామన్నారు. ఆలయ కమిటీ పూర్వపు చైర్మన్ వేగి లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పెద్దలు దాడి ముసిలినాయుడు, ఆడారి అచ్చియ్యనాయుడు, పెంటకోట ఉమేష్, కాండ్రేగుల జగ్గారావు, కిరణ్, వెంకట్, రామ్మోహనరావు, ఆడారి కాశీబాబు, పెంటకోట జగన్నాథరావు మాస్టారు, జల్లేపల్లి కిష్టప్ప, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

గురు బ్రహ్మ అవార్డు గ్రహీతకు అభినందనలు



గురుబ్రహ్మ అవార్డు అందుకున్న వరప్రసాద్

ఎస్.రాయవరం: రాష్ట్ర స్థాయి గురుబ్రహ్మ అవార్డుకు ఎంపికైన బయాలజీ టీచర్ కొలగాని వరప్రసాద్‌ను మండల ఉపాధ్యాయులు, స్నేహితులు అభినందించారు. జాతీయ ఉపాధ్యాయ టీచర్స్ డే సందర్భంగా రాజమండ్రిలో ఆనంద్ రెసిడెన్సీలో గురుబ్రహ్మ అవార్డు అందుకున్నట్టు వరప్రసాద్ తెలిపారు. స్థానిక నాయకులు ఆదివారం ఆయనను సత్కరించి, అభినందించారు.

వెంకన్న ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: ప్రతి ఒక్కరూ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మునగపాక వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. ఆదివారం మునగపాకకు చెందిన ఆడారి జగన్నాథరావు తవవంతు విరాళంగా రూ.5,116 నగదును ప్రసాద్‌కు అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన దొడ్డి నూకరాజు రూ.7,777 నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆలయ నిర్మాణంలో అందరూ పాలు పంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూరిశెట్టి రాము, దాడి ముసిలినాయుడు, పెంటకోట ఉమేష్, ఆడారి అచ్చియ్యనాయుడు, కోనపల్లి రామ్మోహనరావు, మొల్లేటి సత్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ ఐషర్ వ్యాను దగ్ధం

నాతవరం : నర్సీపట్నం నుంచి తుని వైపు వెళ్తున్న ఐషర్ వ్యాను ఆదివారం తాండవ జంక్షన్‌కు వచ్చేసరికి వాహనం షార్టు సర్క్యూట్ కారణంగా ప్రమాదశావత్తూ అగ్నిప్రమాదంలో కాలిపోయింది. నర్సీపట్నం నుంచి అగ్గిపెట్టెలు భోజనాలు చేసే ప్లేట్లు లోడు వేసుకోని ఆదివారం ఉదయం వస్తుండగా నాతవరం మండలం తాండవ జంక్షన్ సమీపంలో కాల కృత్యాలు కోసం డ్రైవరు రోడ్డు పక్కన ఉన్న జీడితోటలోకి వెళ్లారు. ఒక్కసారిగా ఐషర్ వ్యాను లోంచి పొగతో పాటు మంటలు వ్యాపించాయి. స్థానికులు గుర్తించి నర్సీపట్నం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వాహనం వచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసింది. అప్పటికే వాహనం అందులో ఉన్న సామాగ్రి పూర్తిగా కాలిపోయిందని స్థానికులు తెలిపారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు



సమావేశమైన కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



సమావేశమైన మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

కోటవురట్ల: పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికతో ఆ పాఠశాల ఆవరణం పులకించింది. కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1974–75 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. వారి ఆత్మీయ కలయికతో సంతోషం వెల్లివిరిసింది. ఆనాటి తీపి గురుతులు, గురువుల బెత్తం దెబ్బలు గుర్తుకు తెచ్చుకుని మనసారా నవ్వుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని ఎక్కడెక్కడ ఎలా స్థిరపడ్డారో చెప్పుకున్నారు. ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. మళ్లీ మళ్లీ కలుసుకుని ఆనాటి స్నేహ బంధాన్ని పదిలం చేసుకుందామని వాగ్దానం చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు షేక్ కరీం, శేషు, కిరణ్, రాము, నాయుడు, వెంకట్రావు, జగ్గా తదితరులు హాజరయ్యారు.

మునగపాకలో..

మునగపాక: స్థానిక పరదేశమ్మ తల్లి గుడి ప్రాంగణంలో ఆదివారం మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1980లో పదో తరగతి చదివిన విద్యార్థులంతా కలిసి సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. నాడు చదువుకున్న రోజుల్లోని తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, సూరిశెట్టి శ్రీనివాసరావు, ఏవీఎస్ అప్పారావు, బుద్ద వెంకటరాము, పెంటకోట రాము, కేపీ రావు, ఆడారి నాగేశ్వరరావు, తదితరులు ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.

మునగపాకలో ఉచిత కంటి వైద్య శిబిరం



మునగపాక పంచాయతీ కార్యాలయంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మునగపాక: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సర్పంచ్ దిమ్మల అప్పారావు ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన రోగులకు కంటి వైద్యుడు నాగేశ్వరరావు పరీక్షలు చేసి, మందులు అందజేశారు.

బీసీ గర్జన విజయవంతం చేయండి

తుమ్మపాల: బీసీ కుల, జన గణన కోసం విజయవాడ ధర్నా చౌక్ వద్ద 9న జరగనున్న బీసీ గర్జనను విజయవంతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు కోరారు. పట్టణంలో పలువురి బీసీ సంఘాల నేతలను కలిసి కరపత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అందిస్తున్న రిజర్వేషన్ ఫలాలు బీసీలకు దక్కాల్సిన వాటా పొందేందుకు బీసీ కుల, జన గణన తప్పక జరగాలన్నారు. ఇందుకోసం బీసీ కులాలు ఏకతాటిపై వచ్చి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

ఆత్యాపాత్యా పోటీల్లో నర్సీపట్నం విద్యార్థినుల ప్రతిభ



అత్యపాత్య పోటీల్లో రాణించిన విద్యార్థినులు

నర్సీపట్నం : నెల్లూరులో జరిగిన ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్స్ అత్యపాత్య స్టేట్ లెవెల్ టోర్నమెంట్ బాయ్స్, గర్ల్స్ పోటీల్లో నర్సీపట్నానికి చెందిన శ్రీవిద్యాంజలి స్కూల్ బాలికల టీమ్ ద్వితీయస్థానం, బాలుర టీమ్‌లు తృతీయ స్థానంలో నిలిచాయి. వీరిని పాఠశాల కరస్పాండెంట్ వై.శాంతి, స్కూల్ చైర్మన్ వై.అక్షణ్‌కృష్ణ, హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో పాఠశాలకు పేరు తీసుకువచ్చేందుకు బాలికలు, బాలుర టీమ్‌లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన పీఈటీని అభినందించారు.

చండీమాత నమో నమః



నక్కపల్లి కల్యాణ మండపంలో చండీహోమం నిర్వహిస్తున్న రుత్వికులు

నక్కపల్లి : స్థానిక సుబ్బిరామిరెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం చండీహోమం నిర్వహించారు. నక్కపల్లి వైస్ ఎంపీపీ వీసం నానాజీ, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, భవానీ దీక్షా శరన్నవరాత్రి మహోత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన విశాఖ నుంచి వచ్చిన వేద పండితులు పాల్గొని ఈ హోమాన్ని నిర్వహించారు. దేవిసప్తశతి పారాయణంతో పాటు చండీ హోమం చేశారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నక్కపల్లి ఉప సర్పంచ్ వీసం రాజు, పలువురు గురుభవానీలు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో కేంద్ర పథకాలపై ఆరా



ఎం.కృష్ణాపురంలో పింఛన్లు, ఎస్‌జీహెచ్ పథకాలపై సమాచారం సేకరిస్తున్న కేంద్ర బృందం

మాడుగుల : గ్రామీణ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సక్రమంగా అమలు అవుతున్నాయా లేదా అని మండలంలో ఎం. కృష్ణాపురం, కింతలి గ్రామాల్లో ఆదివారం నేషనల్ లెవెల్ మోనిటరింగ్ (ఎన్ఎల్ఎం) బృందం సర్వే చేసింది. కేంద్ర బృంద సభ్యులు అనిల్ గైక్వాడ్, అనిల్ నింబోర్‌కర్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ మేనేజర్ పి.శ్రీనివాస్‌లు ముందుగా ఎం. కృష్ణాపురం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులు ఎలా జరుగుతున్నాయని ఆరా తీశా రు. వితంతు, వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు ఎలా అందుతున్నాయని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న 26 డ్వాక్రా సంఘాల సభ్యులతో మాట్లాడారు. ఎస్‌హెచ్‌సీ గ్రూపులకు అందిస్తున్న రుణాలు, రికవరీ, ఎలా ఉందని, బ్యాంకుల సహకారం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నా రు. ఎస్‌హెచ్‌జీ రుణాలతో మహిళలు అభివృద్ధి చెందడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోనే ఎం.కృష్ణాపురం ఎస్‌హెచ్‌జీ రుణాలు పెట్టుబడితో చిరు వ్యాపారాలతో అభివృద్ధి, గొర్రెలు, మేకలు పెంపకంలాంటి విషయాల్లో ముందంజలో ఉందని, కేంద్రం అందిస్తున్న పథకాలు గ్రామాల్లో సక్రమంగా అమలవుతున్నాయని సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కొంకి అప్పారావు, సర్పంచ్ వడ్డాది చారుమతీదేవి, గాదిరాయి సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు, కింతలి సర్పంచ్ మైచర్ల భవానీ తదితరులు పాల్గొన్నారు.